సాక్షి పల్నాడు

మంగళవారం । 16 । జూలై । 2024



భక్తులకు రక్షణ కల్పించాలి

వినుకొండ(నూజెండ్ల): తొలి ఏకాదశి సందర్భంగా వినుకొండ రామలింగేశ్వరస్వామి తిరునాళ్లకు వచ్చే భక్తులకు రక్షణ కల్పించాలని ఏఎస్పీ లక్ష్మీపతి సోమవారం సిబ్బందికి సూచించారు.



భక్తిశ్రద్ధలతో పీర్ల ఊరేగింపు

బెల్లంకొండ: బెల్లంకొండలో సోమవారం పీర్లను వైభవంగా ఊరేగించారు. మండలంలోని పాపాయపాలెం, బెల్లంకొండ, వన్నాయపాలెం తదితర గ్రామాల్లో ఊరేగింపు చేశారు.

విజయవారాహి అలంకారంలో బండ్లమ్మ



పిట్టలవానిపాలెం: చందోలులో వేంచేసి ఉన్న బగళాముఖి బండ్లమ్మ వారి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని విజయవారాహిగా అలంకరించారు.

న్యూస్‌రీల్

ఎంఈఓల నియామకం

నరసరావుపేట ఈస్ట్: పల్నాడుజిల్లా పరిధిలోని పలు మండలాలకు విద్యాశాఖాధికారులను నియమిస్తూ పాఠశాల విద్య రీజినల్ జాయింట్ డైరెక్టర్ బి.లింగేశ్వరరెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం పనిచేస్తున్న ఎంఈఓలు ఉద్యోగ విరమణ, దీర్ఘకాలిక సెలవు కారణంగా ఆయా మండలాలలో నూతన ఎంఈఓలను నియమించారు. ఉద్యోగ విరమణ కారణంగా ఖాళీలు ఏర్పడ్డ మాచర్లకు విజయపురిసౌత్ ప్రభుత్వ హెచ్‌ఎం కె.కాంతారావును ఎంఈఓ-1గా నియమించారు. బెల్లంకొండ ఎంఈఓ-1 బి.రాజకుమారి, రాజుపాలెం ఎంఈఓ-1 బి.మల్లికార్జునశర్మ దీర్ఘకాలిక సెలవులో వెళ్లిన కారణంగా సత్తెనపల్లి ఎంఈఓ-1 ఎ.శ్రీనివాసరావుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. అలాగే ఉద్యోగ విరమణతో ఖాళీగా ఉన్న రొంపిచర్లకు వినుకొండ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పి.హావీల, దుర్గికి శావల్యాపురం ఎంఈఓ-1 ఎం.సాంబశివరావు, రెంటచింతలకు నరసరావుపేట ఎంఈఓ-1 వై.ఏసుబాబుకు తాత్కాలికంగా బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలాగే మాచవరంకు పిల్లుట్ల పాఠశాల హెచ్‌ఎం ఎ.శ్రీనివాసరెడ్డి, దాచేపల్లికి కె.కాంతారావు, అచ్చంపేటకు పెదకూరపాడు ఎంఈఓ-1 వై.ప్రసాదరావుకు తాత్కాలికంగా బాధ్యతలు అప్పగించారు.

భ్రమరాంబకు ఆషాఢ సారె




పెదకాకాని: శివాలయంలో కొలువుదీరిన భ్రమరాంబ అమ్మకు పెదకాకాని గ్రామానికి చెందిన వీరిశెట్టి లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులు సోమవారం ఆషాఢసారె సమర్పించారు. లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులకు ఆలయ ఉప కమిషనర్ దాసర శ్రీ రామ వరప్రసాదరావు, ఆలయ స్థానాచార్యులు పొత్తూరు సాంబశివరావు అర్చకులు వేద మంత్రోచ్చారణలతో స్వాగతం పలికారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణల అనంతరం భ్రమరాంబ అమ్మవారికి చీర, పసుపు కుంకుమ, వివిధ రకాల పండ్లు, పూజా సామగ్రితో లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులు సారె సమర్పించారు. ప్రత్యేక పూజలు జరిపించారు.

చిన్నారిపై లైంగికదాడి, హత్య కేసులో జీవిత ఖైదు

విజయపురిసౌత్: మాచర్ల మండలం కొత్తూరు గ్రామానికి చెందిన 4 సంవత్సరాల చిన్నారిపై లైంగికదాడి చేసి, హత్య చేసిన కేసులో ముద్దాయి కేతావత్ బాలునాయక్‌కు గుంటూరు పోక్సో కోర్టు జడ్జి కె.నీలిమ జీవితఖైదు విధించినట్లు విజయపురిసౌత్ ఎస్‌ఐ పట్టాభిరామయ్య సోమవారం తెలిపారు. ఎస్‌ఐ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి... నల్గొండ జిల్లా చందంపేట మండలం కంబాలపల్లి గ్రామానికి చెందిన బాలునాయక్ అలియాస్ పుల్లునాయక్ 2018వ సంవత్సరంలో కొత్తూరు గ్రామంలో 4 ఏళ్ల చిన్నారిని ఊరు శివారులోని రైస్‌మిల్లు వద్దకు తీసుకువెళ్లి లైంగికదాడి చేసి హత్య చేశాడు. అప్పటి ఎస్‌ఐ ఎం.వాసు కేసు నమోదు చేయగా, నాటి గురజాల డీఎస్పీ కేవీవీఎన్‌వీ ప్రసాద్ కేసు దర్యాప్తు చేశారు. గుంటూరు అర్బన్ జిల్లా వెస్ట్ డివిజన్ డీఎస్పీ కేజీవీ సరిత చార్జ్‌షీట్ దాఖలు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. నేరం రుజువు కావటంతో ముద్దాయి బాలునాయక్‌కు పోక్సో కోర్టు జడ్జి జీవిత ఖైదు విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 503.00 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్‌ఎల్‌బీసీకి 400 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 813.10 అడుగుల వద్ద ఉంది.

యార్డుకు 29,930 బస్తాల మిర్చి

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 29,930 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 26,747 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.16,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి రూ.18,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ.10,500 నుంచి రూ.17,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాలకు రూ.9,000 నుంచి రూ.18,500 వరకు లభించింది.

భృతి సంగతేంటి!

20 లక్షల ఉద్యోగాలు అన్నారు.. ఉద్యోగం వచ్చేవరకు నిరుద్యోగ భృతి ఇస్తామంటూ ఊరూరా ఊదరగొట్టారు.. ఓట్లు దండుకొన్నారు. తీరా గెలిచాక దానిపై మౌనం వహించారు.. మెగా డీఎస్సీ అంటూ ఊరించి.. ఉసూరుమనిపించగా.. భృతి అయినా వస్తుందలే అంటూ.. ఆ అత్తెసరు పోస్టులకే చేస్తున్న చిన్నా, చితకా ఉద్యోగాలు మానుకొని శిక్షణ తీసుకుంటున్న నిరుద్యోగులకు టీడీపీ ప్రభుత్వ తీరు శరాఘాతంగా మారింది. డీఎస్సీ నిర్వహణపై స్పష్టత లేక.. నిరుద్యోగ భృతి రాక ప్రభుత్వంపై మండిపడుతున్నారు. చంద్రబాబు మోసపూరిత వైఖరి తెలిసీ మోసపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- యువతకు 20 లక్షల ఉద్యోగాలిస్తామని ఎన్నికల హామీ ఇచ్చిన కూటమి నేతలు
- చంద్రబాబు తొలిసంతకం మెగా డీఎస్సీ కోసం ఎదురు చూస్తున్న జిల్లా యువత
- పనులు మానేసి కోచింగ్ సెంటర్లలో చేరిక
- జాబ్ క్యాలెండర్ విడుదల చేయకపోవడంతో ఆందోళనలో యువత
- ఉద్యోగం వచ్చేంత వరకు నెలకు రూ.3 వేలు ఇస్తామని సూపర్ సిక్స్‌లో పేర్కొన్న వైనం
- జిల్లాలో నిరుద్యోగ భృతి కోసం చూస్తున్న సుమారు 7 లక్షల మంది యువత

సాక్షి, నరసరావుపేట: ఇంటింటికి ఉద్యోగం, ఉద్యోగం వచ్చేవరకు రూ.3 వేల నిరుద్యోగ భృతి అంటూ హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం నెల రోజులు దాటినా నిరుద్యోగులను పట్టించుకున్న పాపానపోలేదు. ఉద్యోగాలు భర్తీ చేయలేదు.. ఆలోగా ఇవ్వాల్సిన నిరుద్యోగ భృతి రూ.3 వేలు కూడా ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వ అధికారంలోకి రాగానే ఉద్యోగాలు పొందవచ్చని యువత పెట్టుకున్న ఆశలు అడియాశలయ్యాయి. చంద్రబాబు మరోసారి మభ్యపెడుతున్నారంటూ గగ్గోలు పెడుతున్నారు. అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీపై తొలి సంతకం చేసిన చంద్రబాబు దాన్ని అటకెక్కించారు. సంతకం పెట్టి ఐదు వారాలు అవుతున్నా ఇంతవరకు డీఎస్సీ గురించి సీఎం గానీ, సంబంధిత మంత్రి నారా లోకేష్ గానీ మాట్లాడకపోవడం గమనార్హం. మరోవైపు గ్రూప్-1, 2, 4 ఉద్యోగాల భర్తీ గురించి ప్రభుత్వం నుంచి ఎటువంటి ప్రకటన వెలువడలేదు. ఈ నేపథ్యంలో జాబ్ క్యాలెండర్ ఎప్పుడు ప్రకటిస్తారు? ఉద్యోగాలు ఎప్పుడు భర్తీ చేస్తారని నిరుద్యోగులు, వారి కుటుంబ సభ్యులు ప్రశ్నిస్తున్నారు.

7.02 లక్షల కుటుంబాలు ఎదురుచూపు...

చంద్రబాబు ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు తమ బిడ్డలకు ఉద్యోగం ఇస్తాడని పల్నాడు జిల్లాలోని సుమారు 7.02 లక్షల కుటుంబాలు ఎదురు చూస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో చేస్తున్న చిన్నా, చితకా ఉద్యోగాలు, పనులు మానుకొని యువత నరసరావుపేటతో పాటు గుంటూరు, విజయవాడ, హైదరాబాద్‌లకు వెళ్లి పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే పనిలో పడ్డారు. ఇప్పుడు డీఎస్సీపై స్పష్టత లేక, నిరుద్యోగ భృతి రాక ఇరకాటంలో పడ్డామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ఇంటింటికి తిరిగి ప్రచారం చేసిన సూపర్-6లో మొదటి హామీ అయిన 20 లక్షల ఉద్యోగాల కల్పన, లేకపోతే నెల నెలా రూ.3 వేలు భృతిని, వెంటనే ఎటువంటి షరతులు, నిబంధనలు లేకుండా అమలు చేయాలని నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.

2014లో మాదిరిగానే..

'జాబు రావాలంటే బాబు రావాలి.. జాబు వచ్చే వరకు నిరుద్యోగ భృతి' అంటూ 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాయుడు ఆ ఐదేళ్లు ఏం చేశారన్నది అందరికీ తెలిసిందే. మూడేళ్ల వరకు నిరుద్యోగ భృతి ఊసెత్తలేదు. నిరుద్యోగుల నుంచి పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో వారిని మభ్యపెట్టేందుకు 2017-18 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో రూ.500 కోట్లను కేటాయించారు. అయితే ఆ సంవత్సరం కూడా ఒక్కరికీ ఒక్క రూపాయి ఇచ్చిన పాపాన పోలేదు. అప్పటి ప్రతిపక్షనేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన సుదీర్ఘ పాదయాత్రలో ఎక్కడికక్కడ చంద్రబాబు నిరుద్యోగులకు చేస్తున్న అన్యాయాన్ని ఎండగట్టడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఎన్నికలకు ముందు పల్నాడు జిల్లాలో కనీసం పదివేల మందికి కూడా భృతిని ఇవ్వకుండా మోసం చేశారు. 2014-19 మధ్య మోసం చేసినట్టు మరోసారి చంద్రబాబు మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారని యువత ఆందోళన చెందుతోంది.

నిరుద్యోగ భృతి కోసం యువత ఎదురుచూపులు



శాశ్వత ఉద్యోగాలు కల్పించిన వైఎస్ జగన్...

2019లో అధికారం చేపట్టిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వెంటనే గ్రామ, వార్డు సచివాలయాల పేరిట శాశ్వత ఉద్యోగాలను కల్పించి పల్నాడు జిల్లాలో 4,703 మంది యువతకు బంగారు భవిష్యత్తు కల్పించారు. మెడికల్ డిపార్ట్‌మెంట్‌లో ఖాళీలన్నీ భర్తీ చేశారు. అలాగే ఇతర శాఖల్లో శాశ్వత, కాంట్రాక్టు పోస్టులు భర్తీ చేశారు. ఆప్కాస్ పేరిట వేలాది మందికి అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలు కల్పించారు. యవతకు ఉద్యోగాలు పొందేందుకు ప్రతి నియోజకవర్గంలో స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణను అందజేశారు. వైఎస్ జగన్ ప్రభుత్వం మాదిరి కూటమి ప్రభుత్వం కూడా శాశ్వత ప్రాతిపదికన తమకు ఉద్యోగాలను కల్పించాలని యువత డిమాండ్ చేస్తోంది.

మాట నిలబెట్టుకోవాలి



ఎన్నికలకు ముందు కూటమి నేతలు నిరుద్యోగులకు రూ.3వేల భృతి ఇస్తామని, ఇంటికొక ఉద్యోగం ఇస్తామని సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేస్తామని ప్రతి సభలో ప్రకటించారు. అయితే ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పుడు నిరుద్యోగ భృతిపై ఏమీ మాట్లాడడం లేదు. మాట నిలబెట్టుకుంటారని నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారు.

– కాశిబోయిన వెంకటేశ్వర్లు, డిగ్రీ, రాజుపాలెం, ఆర్అర్ సెంటర్

వైఎస్ జగన్ హయాంలో జిల్లాలో ఉద్యోగాల కల్పన..

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగాలు :	4,703
వైద్య, ఆరోగ్యశాఖ :	3000
కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ :	3000
వలంటీర్లు :	10,276

మోసం చేయడం తగదు



ఎన్నికలకు ముందు 20లక్షల ఉద్యోగాలు ఇస్తాం.. అప్పటివరకు నిరుద్యోగ భృతి ఇస్తామంటూ కూటమి మేనిఫెస్టోలో ప్రకటించారు. అత్యధిక మెజారిటీతో గెలుపొందారు. అధికారంలోకి వచ్చాక నిరుద్యోగుల ఊసే ఎత్తడం లేదు. ఎంసీఏ చేసి చిన్న చిన్న పనులతో ఉపాధి పొందుతున్నాను. ఇచ్చిన హామీ నిలబెట్టుకోకుండా నిరుద్యోగులను మోసం చేయడం కూటమి ప్రభుత్వానికి తగదు.

– ఆవుల వెంకటేశ్వరరెడ్డి, ఎంసీఏ, నర్శింగపాడు, నకరికల్లు మండలం

నిరుద్యోగుల ఊసే ఎత్తడం లేదు



కూటమి అధికారంలోకి వస్తే నిరుద్యోగులందరికీ మంచిరోజులు వస్తాయని ఊదరగొట్టారు. ఉద్యోగం వచ్చేవరకు నిరుద్యోగ భృతి అన్నారు. ఉద్యోగం కల్పిస్తాం.. ధైర్యంగా ఉండండి అన్నారు. ఇప్పుడేమో అసలు నిరుద్యోగ భృతి గానీ, ఉద్యోగ కల్పనకు సంబంధించిన అధికారిక ప్రకటనలు గానీ చేయడం లేదు. ప్రసంగాలు, ప్రకటనలు చేస్తూ కాలయాపన చేస్తున్నారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకొని నిరుద్యోగుల పట్ల చిత్తశుద్ధిని చాటుకోవాలి.

– రొండా మోహన్‌రెడ్డి, ఎంబీఏ, నర్శింగపాడు గ్రామం, నకరికల్లు మండలం

నోరు మెదపడం లేదు



ఇంతవరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిరుద్యోగ భృతిపై నోరు మెదపడం లేదు. మేనిఫెస్టోలో నిరుద్యోగులందరికీ రూ.3వేలు భృతి ఇస్తామన్నారు. ఇంతవరకు దానిపై విధివిధానాలు ప్రకటించలేదు. చేస్తున్న ఉద్యోగం మానుకొని శిక్షణ తీసుకుంటున్నాను.

– వట్టే కేశవరెడ్డి, బీటెక్, చౌటపాపాయపాలెం, ఆర్అర్ సెంటర్

సమస్యలను అధిగమించండి

- అధికారులతో కలెక్టర్ అరుణ్‌బాబు
- ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 96 వినతుల స్వీకరణ

నరసరావుపేట: వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉన్న సమస్యలను అధిగమించి, ప్రగతిని సాధించాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు జిల్లా అధికారులకు దిశా నిర్దేశం చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. డీఆర్‌ఓ కె.వినాయకం, డీఆర్‌డీఏ పీడీ బాలూనాయక్‌తో కలిసి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి 96 అర్జీలను స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ శ్రద్ధ, అంకిత భావంతో పనిచేసి జిల్లాను ఉన్నతస్థానంలో నిలపాలని కోరారు.



సమస్యలు ఆలకిస్తున్న జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు

పొలం విడిపించి దళితులకు పంచండి



నూజెండ్ల మండలం తలారుపల్లి పంచాయతీ పరిధిలో దాట్లవారిపాలెంలో రెండు సర్వే నెంబర్ల కిందనున్న 174 ఎకరాల ప్రభుత్వ పోరంబోకు భూమిని ఒక వ్యాపారి ఆక్రమించి చేపల చెరువులు, జామాయిల్ తోటలు వేసి లాభం పొందుతున్నాడు. గతంలో వాటిని దళితులు సాగుచేసుకొని జీవనం పొందేవారు. పదేళ్ల నుంచి ఆ భూములను విడిపించాలని ఆందోళనలు చేయటంతో ప్రభుత్వం సర్వే చేయించి ఆక్రమణకు గురైనట్లు నిర్ధారించింది. వెంటనే ఆ భూములు విడిపించి దళితులకు పంపిణీ చేయించగలరు.

– వీడీఎం నాయకులు

పూర్తి దివ్యాంగురాలికి రూ.15వేలు పింఛన్ ఇవ్వండి

నా చెల్లెలు నాగశ్వేత పూర్తి దివ్యాంగురాలు. ఏమీ తెలియని అమాయకురాలు. గత ప్రభుత్వంలో రూ.3వేలు పింఛన్ ఇచ్చారు. నూతన ప్రభుత్వంలో రూ.6వేలు చేశారు. పూర్తి దివ్యాంగులు అయితే రూ.15వేలు ఇస్తామని చెప్పారు. దీని ప్రకారం ఆమెకు రూ.15వేలు పింఛన్ అమలుచేయాలని అధికారులను కోరగా, తమకు పింఛన్ పెంపుపై ఎటువంటి మార్గదర్శకాలు రాలేదని అధికారులు చెబుతున్నారు. న్యాయం చేయాలి.

– శ్రీలక్ష్మి, దివ్యాంగురాలి సోదరి

డంపింగ్ యార్డును తరలించండి



ఎస్ఆర్‌కేటీ సమీపంలోని మున్సిపల్ డంపింగ్ యార్డును తొలగించి ప్రజల ప్రాణాలను కాపాడాలి. గతంలో అనేకమార్లు అధికారులకు విన్నవించినా ఫలితంలేదు. దుర్వాసనతో పాటు చెత్త తగులబెట్టడం వలన వచ్చే పొగ వలన ఆ రోడ్డువెంట ప్రయాణించే వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. శ్వాసకోశ వ్యాధులతో ప్రజలు ఆస్పత్రుల పాలవుతున్నారు.

– రాంబాబు, వెంకట్, సీపీఐ నాయకులు

శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి



నూతన ఎస్పీకి స్వాగతం పలుకుతున్న అడ్మిన్ ఎస్పీ రాఘువేంద్ర, అదనపు ఎస్పీ లక్ష్మీపతి



గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠికి మొక్క అందజేస్తున్న జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు

జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన కంచి శ్రీనివాసరావు

నరసరావుపేట: జిల్లాలో శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు పేర్కొన్నారు. పల్నాడు జిల్లా నూతన ఎస్పీగా నియమితులైన ఆయన సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అడ్మిన్ ఎస్పీ రాఘువేంద్ర, అదనపు ఎస్పీ రఘుపతి, ఏఆర్ డీఎస్పీ గాంధీలు పుష్పగుచ్ఛం అందజేసి ఘనస్వాగతం పలికారు. అనంతరం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. చరిత్రాత్మకమైన పల్నాడు జిల్లాకు రావడం సంతోషంగా ఉందన్నారు. ఎన్నికల అనంతరం పల్నాడులో అనేక లా అండ్ ఆర్డర్ సమస్యలు వచ్చాయని, వాటినిగతంలో ఉన్న ఎస్పీ సమర్థవంతంగా పరిష్కరించారని వెల్లడించారు. తాను కూడా జిల్లాలోని పరిస్థితులను తొందరగా అవగాహన చేసుకుని చట్టపరంగా అన్ని సమస్యలు పరిష్కరిస్తానని చెప్పారు. డ్రగ్స్ నిషేధానికి జిల్లాలో 100రోజుల ప్రచారం నిర్వహిస్తామన్నారు. ఏ సమస్యలు ఎదురైనా నేరుగా ఉన్నతాధికారుల వద్దకు వచ్చి ఫిర్యాదు చేయవచ్చని ప్రజలకు సూచించారు.

త్రికోటేశ్వరుణ్ణి దర్శించుకున్న జిల్లా ఎస్పీ

నరసరావుపేట రూరల్: కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి వారిని సోమవారం జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన కంచి శ్రీనివాసరావు దంపతులు దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఎస్పీ శ్రీనివాసరావుకు అర్చకులు స్వాగతం పలికారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం స్వామివారి శేషవస్త్రాన్ని, తీర్థప్రసాదాలను అర్చకులు అందజేశారు. టీడీపీ నాయకుడు కడియం కోటిసుబ్బారావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కలెక్టర్, రేంజ్ ఐజీలను కలిసిన ఎస్పీ...

పల్నాడు జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసుగా సోమవారం బాధ్యతలు స్వీకరించిన కంచి శ్రీనివాసరావు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌కుమార్, గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠిని వారివారి కార్యాలయాల్లో మర్యాదపూర్వకంగా కలిశారు. వారికి మొక్కలు, పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఎస్పీకి వారు అభినందనలు తెలియచేశారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషిచేయాలని సూచించారు.

భక్తులకు సౌకర్యాల కల్పనలో రాజీవద్దు



కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష చేస్తున్న జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు

- కలెక్టర్ పి.అరుణ్‌బాబు
- కోటప్పకొండపై తొలి ఏకాదశి వేడుకలపై ఎమ్మెల్యే చదలవాడతో కలిసి సమీక్ష

నరసరావుపేట: ఈనెల 17న తొలి ఏకాదశి సందర్భంగా కోటప్పకొండకు వేలాదిగా తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా అధికారులను జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. సోమవారం ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో కలెక్టరేట్‌లో ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబుతో కలిసి సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఏకాదశి సందర్భంగా గిరి ప్రదక్షిణ చేసే భక్తుల కోసం ప్రదక్షిణ మార్గం చదును చేయాలన్నారు. మార్గం ఆద్యంతం మంచినీరు అందుబాటులో ఉంచాలన్నారు. కొండ పైనా, కింద అంబులెన్సులు సిద్ధంగా ఉంచుకోవాలని, అవసరమైన చోట మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యంగా పాము కాటు మందులు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ట్రాక్టర్లు, ఆటోలలో పరిమితికి లోబడి మాత్రమే ప్రయాణికులను అనుమతించాలన్నారు. భక్తుల అవసరం మేరకు బస్సులు నడపాలని, బస్సులు నడిచే వేళలపై ప్రచారం కల్పించాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే చదలవాడ మాట్లాడుతూ ఆలయ ప్రసాదంలో నాణ్యత పాటించాలని, భక్తులకు వీలైనంత త్వరగా, ప్రశాంత వాతావరణంలో స్వామి దర్శనభాగ్యం కలిగేలా చూడాలని అధికారులను కోరారు. జిల్లా అటవీ అధికారి రామచంద్ర రావు, ఆర్డీఓ శ్రీదేవి, దేవ దాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సత్యనారాయణ రెడ్డి, డీపీఓ విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెన్సిల్ మొనలపై నెల్సన్ మండేలా జీవిత చరిత్ర

స్వర్ణ సూక్ష్మ కళాకారిణి మహిత ప్రతిభ





స్వర్ణ(కారంచేడు): దక్షిణాఫ్రికా కాంతి కిరణం, నోబెల్ శాంతి బహుమతి అవార్డు గ్రహీత నెల్సన్ మండేలా జీవిత చరిత్రను బాపట్ల జిల్లా కారంచేడు మండలం స్వర్ణ గ్రామానికి చెందిన అన్నం మహిత పెన్సిల్ మొనలపై రాసి అందరినీ అబ్బురపరచింది. ఈమె కొంత మంది మహానుభావుల జీవిత చరిత్రలను పెన్సిల్ మొనలపై చెక్కుతూ శభాష్ అనిపించుకుంటోంది. ఆమె తయారు చేసిన నెల్సన్‌మండేలా జీవిత చరిత్ర ఫ్రేమ్‌ను ఈనెల 18వ తేదీన ఆయన జయంతిని పురస్కరించుకొని దక్షిణాఫ్రికాకు పంపించే ఏర్పాట్లు చేస్తున్నట్లు మహిత తల్లిదండ్రులు అన్నం నరసింహారావు, భ్రమరాంబ తెలిపారు.

రూ.15 కోట్లతో ఔషధ వ్యాపారి పరారీ

- నాలుగు రోజుల క్రితం కుటుంబంతో సహా అజ్ఞాతంలోకి వెళ్లిన వైనం
- వ్యాపారి ఇంటి వద్ద బాధితుల ఆందోళన

నరసరావుపేట టౌన్: హోల్‌సేల్ ఔషధ వ్యాపారి రూ.15 కోట్లతో ఉడాయించిన సంఘటన పట్టణంలో కలకలం రేపింది. అప్పులిచ్చిన బాధితులు సోమవారం వ్యాపారి ఇంటి వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. కుటుంబంతో సహా నాలుగు రోజుల కిందటే ఊరు విడిచి వెళ్లినట్లు తెలుసుకొని బాధితులు ఆందోళన చేశారు. వివరాలలోకి వెళితే.. విద్యుత్ కార్యాలయం వెనుక ప్రాంతంలోని అలవాల బజార్‌లో నివాసం ఉంటున్న ఔషధ వ్యాపారి కోట సెంటర్‌లో 15 ఏళ్లుగా హోల్‌సేల్ దుకాణం నిర్వహిస్తున్నాడు. వ్యాపారం బాగా చేస్తూ తీసుకున్న అప్పులకు సకాలంలో వడ్డీలు చెల్లిస్తుండటంతో నమ్మిన వడ్డీ వ్యాపారులు, స్నేహితులు అధిక మొత్తంలో డబ్బులు వడ్డీకి ఇచ్చారు. 20 రోజుల కిందట దుకాణంలో ఉన్న స్టాక్ మొత్తాన్ని రూ.5 కోట్లకు విక్రయించి సొమ్ము చేసుకున్నాడు. దీంతోపాటు చీటిపాటలు పాడి నగదు కూడబెట్టుకున్నాడు. నాలుగు రోజుల కిందట కుటుంబ సభ్యు లతో సహా ఇంటికి తాళాలు వేసి అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. అతని ఫోన్ స్విచ్ ఆఫ్ రావటంతో వడ్డీ వ్యాపారులు ఆరా తీశారు. దీంతో అసలు విషయం బయటపడింది. వ్యాపారి ఇంటివద్దకు పెద్ద సంఖ్యలో బాధితులు వచ్చారన్న విషయం తెలుసుకున్న ఓ బ్యాంక్ ప్రతినిధులు ఇల్లు తమ బ్యాంక్ తాకట్టులో ఉందని నోటీసు అంటించారు. ఇంటిని తనఖా పెట్టి సుమారు రూ.3 కోట్ల వరకు అప్పు తీసుకున్నట్లు సమాచారం. బాధితులంతా కలిసి పోలీసులను ఆశ్రయించాలని సన్నద్ధం అవుతున్నారు.

కళాక్షేత్రాలను ఏర్పాటు చేయాలి

సినీ నటుడు రఘుబాబు



నృత్య పోటీ విజేతలకు బహుమతులు అందిస్తున్న సినీ నటుడు రఘుబాబు

నరసరావుపేట ఈస్ట్: సామాజిక సమస్యలను ప్రజలకు తెలియచేసే కళలను కాపాడుకునేందుకు ప్రతి పట్టణంలో కళాక్షేత్రాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని సినీ నటుడు రఘుబాబు తెలిపారు. నరసరావుపేట రంగస్థలి 44వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం రాత్రి నిర్వహించిన పల్నాడు కల్చరల్ కార్నివాల్-2024 ముగింపు కార్యక్రమంలో రఘుబాబు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కళలకు కాణాచిగా ఉన్న నరసరావుపేటలో గత 44 సంవత్సరాలుగా రంగస్థలి కళల అభివృద్ధికి కృషి చేయటం అభినందనీయమన్నారు. ప్రాచీన సంస్కృతి, కళలను భావితరాలకు అందించేందుకు కళాక్షేత్రాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కాగా, కల్చరల్ కార్నివాల్‌లో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన నృత్య పోటీల విజేతలకు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు బహుమతులు అందచేశారు. అలాగే ఆనందభైరవి సినిమా ఫేమ్ భాగవతుల వెంకటరామశర్మ ఆధ్వర్యంలో విజయవాడ శ్రీనృత్య ఆర్ట్స్ అకాడమీ కళాకారులు నిర్వహించిన కూచిపూడి బృంద నృత్య కేళిక ఆహుతులను అలరించింది. సినీ, రంగస్థల నటుడు గుమ్మడి గోపాలకృష్ణ, రంగస్థలి ఫైనాన్స్ కమిటీ చైర్మన్ కపలవాయి విజయకుమార్, అధ్యక్షుడు షేక్ మహబూబ్ సుభాని, ప్రధానకార్యదర్శి నల్లపాటి బోస్, గౌరవ అధ్యక్షుడు కిలారు వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

లాటరీ తగిలిందని రూ.4.09లక్షలు మోసం

పోలీసు ప్రజావేదికలో బాధితుల ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు



బాధితుల సమస్యలు ఆలకిస్తున్న జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు

నరసరావుపేట: ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వచ్చిన ఫిర్యాదులను త్వరితంగా పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటుచేసిన పరిష్కార వేదికకు అధ్యక్షత వహించి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారి నుంచి కుటుంబ, ఆర్థిక, ఆస్తి, దొంగతనాలు, మోసం, విడాకులు తదితర అంశాలపై ఫిర్యాదులు స్వీకరించారు.

లాటరీ తగిలిందని మోసం చేశారు

కొందరు నాకు ఫోన్‌చేసి లాటరీ రూ.5లక్షలు వచ్చిందని, అది నీకు రావాలంటే ప్రాసెసింగ్ ఫీజు, జీఎస్టీ కోసమని రూ.4.09 లక్షలు ఫోన్‌పే చేయాలంటూ డబ్బులు తీసుకుని మోసం చేశారు. వారిపై చర్యలు తీసుకొని డబ్బులు నాకు ఇప్పించండి.
– గాలి వెంకటేశ్వరరావు, శ్యామరాజపురం, దుర్గి మండలం

జామియా మసీదు వస్తువులు దొంగిలించారు

శ్రీరాంపురంలోని జామియా మసీదుకు చెందిన రేకులు, పైపులు, తలుపులను ఓ వ్యక్తి దొంగించి ఈపూరు దగ్గరలోని తన స్థలంలో షెడ్డు నిర్మించుకున్నాడు. అతనిపై చర్యలు తీసుకోండి.
– షేక్ జాని మౌలాలి, మాజీ కౌన్సిలర్, మసీదు సెక్రటరీ

జీపీఎస్‌ను ఎట్టి పరిస్థితుల్లో ఒప్పకోం

- యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.ప్రేమ్‌కుమార్
- జిల్లా విద్యాశాఖ కార్యాలయం వద్ద రాజపత్రాల దహనం
- అమలు జీఓ రద్దు చేయాలని డిమాండ్



జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట రాజప్రతులు దహనం చేస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు

నరసరావుపేట: ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కారానికి ఉద్యమాలే శరణ్యమని యూటీఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్షులు పి.ప్రేమ్‌కుమార్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు అన్ని జిల్లా, తాలూకా, మండల, కేంద్రాలలో జీపీఎస్ అమలు జీవో ప్రతులు దహనం కార్యక్రమంలో భాగంగా సోమవారం పల్నాడు జిల్లా విద్యాశాఖ కార్యాలయం వద్ద జీపీఎస్ రాజప్రతులను దహనం చేశారు. ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులను గ్యారంటీ పెన్షన్ స్కీమ్ (జీపీఎస్)లోకి తీసుకొస్తూ గత ప్రభుత్వ విధానాలనే కూటమి ప్రభుత్వం ఈ నెల 12న జీఓ నెం.54 విడుదల చేయడం చూస్తే పాత సీసాలో కొత్త సారా అన్న చందంగా ఉందని మండిపడ్డారు. దీనిపై ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపు ఇచ్చారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, లోకేష్‌లు జీపీఎస్ కంటే మెరుగైన పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని చెప్పి మళ్లీ అదే తీసుకురావడం ఉద్యోగ ఉపాధ్యాయులను మోసం చేయడమే అవుతుందన్నారు. పల్నాడు జిల్లా కార్యదర్శి జి.విజయసారధి, జిల్లా సహాధ్యక్షుడు ఎం.మోహనరావు, జిల్లా కార్యదర్శి టి.వెంకటేశ్వర్లు, జిల్లా ఆడిటర్ జి.ఆంజనేయులు, నరసరావుపేట ప్రాంతీయ శాఖల బాధ్యులు ఓ కోటేశ్వరరావు, కె.వెంకటేశ్వరరావు, పి.సత్యానంద్, ఎం.రామాంజి, షేక్. షరీఫ్ అబ్దుల్ నయీమ్, కెవి.ప్రసాద్, జి.వెంకటేశ్వర్లు, ఎస్ సురేష్ కుమార్, అఖిబ్ బాషా పాల్గొన్నారు.

వైఎస్సార్ విగ్రహ ధ్వంసం గర్హనీయం

కాంగ్రెస్ పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు అలెగ్జాండర్



మాట్లాడుతున్న అలెగ్జాండర్

సత్తెనపల్లి: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని కొంతమంది దుండగులు పగలగొట్టడం గర్హనీయమని కాంగ్రెస్ పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జి.అలెగ్జాండర్ పేర్కొన్నారు. ముప్పాళ్ళ మండలం మాదల గ్రామంలో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహ ధ్వంసంపై సత్తెనపల్లి లోని పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అలెగ్జాండర్ మాట్లాడుతూ దివంగత నేత రాజశేఖరరెడ్డి విగ్రహం ధ్వంసం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు దాసరి జ్ఞానరాజ్ పాల్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పూర్ణచంద్రరావు, జెట్టి శేఖర్, కృష్ణారావు తదితరులు ఉన్నారు.

షటిల్ బాడ్మింటన్ జిల్లా జట్లకు ఎంపిక

నరసరావుపేట రూరల్: గుంటూరు జిల్లా షటిల్ బాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 13,14 తేదీలలో తాడేపల్లిలో నిర్వహించిన 51వ గుంటూరు జిల్లా షటిల్ బాడ్మింటన్ చాంపియన్ షిప్(2024)పోటీలలో పట్టణ క్రీడాకారులు సత్తాచాటారు. అండర్-17 బాలుర విభాగం సింగిల్స్‌లో దూపం కార్తీక్ ప్రతిభ కనబర్చి విజేతగా నిలిచారు. అండర్-13 బాలుర విభాగం డబుల్స్‌లో మున్సిపల్ బాలుర హైస్కూల్ విద్యార్థి కొమ్మాలపాటి సుమిత్ విజేతగా నిలిచారు. ఆదివారం సాయంత్రం జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో నిర్వాహకుల నుంచి సర్టిఫికెట్లు, షీల్డ్‌లు అందుకున్నారు. కార్తీక్, సుమిత్‌లు జిల్లా జట్లకు ఎంపికయ్యారు. ఆగస్టులో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు జిల్లాకు ప్రాతినిధ్యం వహించనున్నారు.

పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం

సత్తెనపల్లి: యువకుడు పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు యత్నించిన సంఘటన సత్తెనపల్లి మండలం నందిగామ గ్రామంలో సోమవారం జరిగింది. సత్తెనపల్లి రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అచ్చంపేట మండలం బొల్లాయపాడు గ్రామానికి చెందిన దాసరి లక్ష్మీనారాయణ (24) కార్పెంటర్‌గా పనిచేస్తుంటాడు. ఈ క్రమంలో సత్తెనపల్లి మండలం నందిగం గ్రామానికి చెందిన స్నేహితుల ఆహ్వానం మేరకు గ్రామానికి వచ్చి సోమవారం నిర్వహించిన ఓ పార్టీలో పాల్గొన్నాడు. అనంతరం శరీరంపై పెట్రోల్ పోసుకొని నిప్పు పెట్టుకున్నాడు. ఘటనలో శరీరం కాలిపోయింది. దీంతో హుటా హుటిన లక్ష్మీనారాయణను పట్టణంలోని ఏరియా వైద్యశాలలో ప్రాథమిక చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

గంజాయి విక్రేతల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌హెచ్‌వో దేవప్రభాకర్, ముసుగులో నిందితులు

పట్నంబజారు: గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచారు. లాలాపేట పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ పి.దేవప్రభాకర్, ఎస్సై ఎం.సుబ్బారావు సోమవారం వివరాలను మీడియాకు వెల్లడించారు. నల్లచెరువుకు చెందిన షేక్ కరిముల్లా, నిమ్మలపేటకు చెందిన చల్లా ఈశ్వరరావు, అదే ప్రాంతానికి చెందిన బత్తుల శ్రావణ్‌కుమార్‌లు లాలాపేటలోని పీకలవాగు కట్ట డంపింగ్ యార్డు వద్ద గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రెండు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. చెడు వ్యసనాలకు బానిసలుగా మారి సులభతరంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో భద్రాచలం, ఒడిశా, ప్రాంతాల నుంచి గంజాయి తీసుకు వచ్చి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఈ కేసులో మరికొంత మంది నిందితులు పరారీలో ఉన్నట్లు తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన కానిస్టేబుల్ రవి, శంకర్, కిరణ్‌లను ఎస్‌హెచ్‌వో దేవప్రభాకర్ అభినందించారు.

నిందితుడి అరెస్ట్

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం రేవేంద్రపాడుకు చెందిన ఓ యువకుడు రోడ్డు ప్రమాదం చేసి కోర్టుకు హాజరు కాకపోవడంతో సోమవారం మంగళగిరి పోలీసులు అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. మంగళగిరి రూరల్ ఎస్ఐ సి.హెచ్.వెంకటేశ్వర్లు కథనం ప్రకారం రేవేంద్రపాడుకరకట్ట మీద మెల్లెంపూడి సమీపంలో మంగళగిరి రూరల్ పరిధి పెదవడ్లపూడి ప్రాంతంలో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని ఢీకొట్టాడు. ఈ క్రమంలో ఆ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. అప్పట్లో ప్రమాదానికి కారణమైన కొప్పుల రమేష్‌ను అరెస్ట్ చేశామని, అప్పటి నుండి కోర్టుకు హాజరు కాకపోవడంతో కోర్టు అరెస్ట్ వారెంట్ ఇచ్చిందని, సురేష్‌ను పెదవడ్లపూడి వద్ద అదుపులోకి తీసుకుని మంగళగిరి కోర్టుకు హాజరు పరచగా నిందుతుడు సురేష్‌కు ఏడు రోజుల రిమాండ్ విధించారని ఆయన తెలిపారు.

కడప జట్టు 35 పరుగులు

వర్షంతో మ్యాచ్‌కు పలుమార్లు అంతరాయం

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్‌కేఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న అండర్-16 బాలుర క్రికెట్ పోటీలలో భాగంగా కడప, చిత్తూరు జిల్లాల మ్యాచ్‌కు వర్షం కారణంగా పలుమార్లు అంతరాయం ఏర్పడింది. వర్షం కారణంగా తొలిరోజు ఆదివారం ఆట రద్దు కాగా, సోమవారం రెండవరోజు ఆట ప్రారంభమైంది. టాస్ గెలిచిన చిత్తూరు జట్టు ఫీల్డింగ్ ఎంచుకోగా బ్యాటింగ్‌కు దిగిన కడప జిల్లా జట్టు రెండవరోజు ఆట ముగిసే సమయానికి వికెట్ కోల్పోకుండా 35 పరుగులు చేసింది. వర్షం కారణంగా ఏర్పడిన అంతరాయంతో కేవలం 14 ఓవర్లు మాత్రమే ఆడారు. కడప ఓపెనర్లు జి.వి.సాయిసాకేత్ 25, ఎం.అజిత్‌ఆనంద్ 7పరుగులతో క్రీజ్‌లో ఉన్నారు. మంగళవారం మూడవరోజు ఆట కొనసాగనుంది. మ్యాచ్‌ను ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు కె.వి.పురుషోత్తమరావు, గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎస్.సీతాపతిరావు పర్యవేక్షించారు.

జీపీఎస్ అమలు గెజిట్‌ను రద్దు చేయాలి

ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.సంపత్‌బాబు

యడ్లపాడు: సీపీఎస్ ఉద్యోగులకు జీపీఎస్ విధానాన్ని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన గెజిట్‌ను వెంటనే రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్-1938) పల్నాడు జిల్లా అధ్యక్షుడు బెజ్జం సంపత్‌బాబు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన సంఘం ప్రధాన కార్యదర్శి పమ్మి వెంకటరెడ్డితో కలిసి ఓ ప్రకటనను విడుదల చేశారు. తాజాగా అధికారం చేపట్టిన ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఉద్యోగ,ఉపాధ్యాయుల సంక్షేమాన్ని విస్మరించి కొత్త జీపీఎస్ విధానాన్ని అమలులోకి తెచ్చేందుకు రంగం సిద్ధం చేసిందన్నారు. ఇందులో భాగంగా గెజిట్‌ను సైతం విడుదల చేయడం సరికాదన్నారు. ముందుగా ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు, సీపీఎస్ ఉద్యోగ సంఘాలతో చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యోగులకు మేలు చేసే పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు.

గిరిజన మహిళా అధికారిపై దుష్ప్రచారం దుర్మార్గం

వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మేరాజోత్ హనుమంత్ నాయక్

వెల్దుర్తి: దేవదాయ శాఖ సహాయ కమిషనర్‌గా పనిచేస్తున్న గిరిజన మహిళా అధికారి శాంతిని ఎల్లో మీడియా టార్గెట్ చేయటం దుర్మార్గమని వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మేరాజోత్ హనుమంత్ నాయక్ అన్నారు. సోమవారం ఆయన మండలంలోని శ్రీరాంపురం తండాలో మీడియాతో మాట్లాడారు. శాంతి గిరిజన మహిళా అధికారి కాబట్టే ఆమెను మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తూ ఎల్లో మీడియా దుష్ప్రచారం చేసిందన్నారు. కనీసం ఆమె వివరణ తీసుకోకుండా తప్పుడు వార్తలు రాయడం గర్హనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే స్పందించిన ఈ విషయం పై సమగ్ర దర్యాప్తు జరిపించి తప్పుడు ప్రచారం చేసిన ఎల్లో మీడియాపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని హనుమంత్ నాయక్ డిమాండ్ చేశారు.

నష్టపోయిన మిర్చి రైతులను ఆదుకోవాలి

కలెక్టరేట్ ఎదుట బాధిత రైతుల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న బాధిత రైతులు, రైతు సంఘ నాయకులు

నరసరావుపేట: జిల్లాలోని అచ్చంపేట మండలం తాళ్ళచెరువు గ్రామంలో యుఎస్-450 నకిలీమిర్చి విత్తనాలు సాగుచేసి నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకునే చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం పలనాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం రైతు సంఘం ఆధ్వర్యంలో నకిలీ విత్తనాలతో నష్టపోయిన తాళ్లచెరువు రైతులతో కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి కలెక్టర్ వినతిపత్రం అందజేశారు. గోపాలరావు మాట్లాడుతూ తాళ్ళచెరువు గ్రామంలో 100 మందికి పైగా రైతులు 250 ఎకరాల్లో యూఎస్ 450 మిర్చి విత్తనాలు సాగు చేశారని, కంపెనీ వారు చెప్పిన సమయానికి పంట రాకపోగా కంపెనీ, వ్యవసాయ, ఉద్యాన అధికారులను కూడా సంప్రదించడం జరిగిందన్నారు. దీనిపై అధికారులు పంట పొలాలు సందర్శించి కొంత ఆలస్యంగా పంట దిగుబడి వస్తుందని రైతులకు చెప్పడంతో ఆశతో దాదాపుగా 180 నుంచి 200 రోజులు దాకా పంటకు పెట్టుబడులు పెట్టారన్నారు. ఇంకా ఎంతకాలమైనా పంట రాకపోవడంతో కంపెనీ వారిని సంప్రదిస్తే వారు రైతుల నుంచి బ్యాంక్ ఎకౌంట్ జిరాక్స్ తీసుకొని నష్టపరిహారం ఇస్తామని ఆశ చూపి నేటికీ ఇవ్వకుండా రైతులను మోసం చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని రైతులు నష్టపోయిన పంటకు పరిహారం చెల్లించేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా నకిలీ విత్తనాలు అమ్మిన డీలర్‌ను శిక్షించాలని డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ అరుణ్‌బాబు వ్యవసాయ, ఉద్యాన అధికారులను పిలిచి వారం రోజుల్లోగా సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. రైతు సంఘం అచ్చంపేట మండల కార్యదర్శి రావెళ్ళ వెంకటేశ్వర్లు, కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు తిమ్మిశెట్టి హనుమంతరావు, బాధిత రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించండి

- ఆర్వో ప్లాంట్లకు మరమ్మతులు చేయించండి
- ఎంఈఓలకు జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు ఆదేశం

నరసరావుపేట: జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు మండల విద్యాధికారులను ఆదేశించారు. అక్కడక్కడా పని చేయని ఆర్వో ప్లాంట్లకు వెంటనే మరమ్మతులు చేయించి ఉపయోగంలోకి తీసుకురావాలన్నారు. ఆర్వో ప్లాంట్లు లేని పాఠశాలల్లో మినరల్ వాటర్ సరఫరా చేయాలన్నారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని బీఆర్ అంబేడ్కర్ స్పందన హాలులో ప్రభుత్వ పాఠశాలల నిర్వహణపై జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం, తాగునీటి నాణ్యత, విద్యార్థుల ఆరోగ్యం విషయాల్లో రాజీ పడొద్దన్నారు. ఎక్కడైనా విద్యార్థులలో అస్వస్థత లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయకుండా స్థానిక ఏఎన్ఎం, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులకు సమాచారం ఇవ్వాలన్నారు. మెనూ ప్రకారం భోజనం అందించే విషయంపై ఏజెన్సీలు, ప్రధానోపాధ్యాయులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలన్నారు. జిల్లాలో 80 శాతం మందికి పైగా పదో తరగతి విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళిక రూపొందించి అమలు చేయాలన్నారు. ప్రతి ఎంఈవో ప్రభుత్వ పాఠశాలలతో పాటూ ప్రైవేటు పాఠశాలల్లోనూ తనిఖీలు చేపట్టి తరగతుల నిర్వహణ పర్యవేక్షించాలన్నారు. డీఈఓ వెంకటేశ్వర్లు, ఎంఈఓలు, మధ్యాహ్న భోజన ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో బాలికల ప్రతిభ



ప్రతిభ చూపిన ఫుట్‌బాల్ బాలికల జట్టుతో హెచ్‌ఎం లతా ప్రియదర్శిని, పీడీ రియాజ్, ఉపాధ్యాయులు

సత్తెనపల్లి: రాష్ట్రస్థాయి జూనియర్స్ బాలికల ఫుట్‌బాల్ పోటీల్లో సత్తెనపల్లి సుగాలి స్కూల్ విద్యార్థినులు ప్రతిభ చూపారు. ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 6, 7, 8 తేదీల్లో అనంతపురం జిల్లా రూరల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్లో అంతర జిల్లాల జూనియర్స్ బాలికల ఫుట్‌బాల్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో పల్నాడు జిల్లా బాలికలు పాల్గొని ప్రతిభ చూపారు. సత్తెనపల్లి సుగాలీ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బి.చంద్రిక. ఎస్.శ్రావ్యలు నేషనల్ క్యాంపునకు సెలెక్ట్ అయ్యారు. వీరిని పాఠశాల హెచ్‌ఎం లతా ప్రియదర్శిని, పీడీ షేక్ మహ్మద్ రియాజ్ ఉపాధ్యాయులు, నాన్ టీచింగ్ స్టాఫ్ సోమవారం అభినందించారు.

భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటుచేయండి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు, భవన నిర్మాణ కార్మికులు

నరసరావుపేట: ప్రతిపక్ష నేతగా నారా చంద్రబాబునాయుడు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని, సంక్షేమ పథకాలన్నీ తిరిగి ప్రారంభిస్తామని ఇచ్చిన హామీని వెంటనే నిలబెట్టుకోవాలని పల్నాడు భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం (సీఐటీయూ) జిల్లా అధ్యక్షుడు అవ్వారు ప్రసాదరావు కోరారు. సోమవారం ఫెడరేషన్ పిలుపులో భాగంగా జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. సంక్షేమ పథకాలను అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వానికి ఒక్కనయా పైసా కూడా ఖర్చు కాదని భవన నిర్మాణదారులు ఇచ్చే ఒక శాతం సెస్సు, కార్మికులు దాచిపెట్టుకున్న నిధితోనే సంక్షేమ బోర్డు నడుస్తుందన్నారు. భవన నిర్మాణ కార్మికుల డబ్బులను వాడుకుంటూ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయకపోవడం అన్యాయమని అన్నారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శిలార్ మసూద్ మాట్లాడుతూ కార్మికులందరికీ పెళ్లి కానుకలు, ప్రసూతి సహాయాలు, సహజ ప్రమాద మరణాలు, తాత్కాలిక అంగవైకల్యం, స్కిల్ డెవలప్మెంట్ తదితరాలు జిల్లా వ్యాప్తంగా సుమారు రూ.3.5కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, వాటన్నింటినీ తక్షణమే ఇప్పించాలని కోరారు. ఇసుక ఉచితం అని ప్రభుత్వం ప్రకటించినా గాని ధరలు నామమాత్రంగానే తగ్గాయని, ఉచిత ఇసుక పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, ఇసుకపై జీఎస్టీని ఎత్తివేయాలని, కృష్ణానది పరివాహ ప్రాంతంలోని అన్నీ మండలాల్లో ఇసుక స్టాక్ పాయింట్లను ఏర్పాటు చేయాలని, ఉచిత సమగ్ర ఇసుక విధానాన్ని రూపొందించి పేద నిర్మాణదారులను ఆదుకొని నిర్మాణ కార్మికుల ఉపాధిని పెంచాలన్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాయకులు కొమ్ముల సురేష్, రామిశెట్టి ఆంజనేయులు, బత్తుల కొండలు, సత్తెనపల్లి తాపీ వర్కర్స్ యూనియన్ నాయకులు బి.మహేష్, పి.ఆదినారాయణ, వి.బాలస్వామి, సీహెచ్ కొండలు, ఎస్.వెంకట్రావు పాల్గొన్నారు.

ఘనంగా యువజన నైపుణ్య దినోత్సవం



మొక్కలు నాటుతున్న విద్యార్థులు

నరసరావుపేట: జిల్లాలో సోమవారం ప్రపంచ యువజన నైపుణ్య దినోత్సవం ఘనంగా నిర్వహించినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ(ఏపీఎస్ఎస్‌డీసీ) అధికారి కొండా సంజీవరావు పేర్కొన్నారు. ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో స్కిల్‌హబ్, స్కిల్ కాలేజ్, డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో మొక్కలు నాటి, విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించామన్నారు. వినుకొండ ఎస్‌కేజీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, శ్రీ సాయి డిగ్రీ కళాశాల, నాగార్జునసాగర్‌లోని ఏపీఆర్‌డీసీ డిగ్రీ కళాశాల, మాచర్ల ఎస్‌వీఆర్ డిగ్రీ కళాశాల, చక్రధర్ డిగ్రీ కళాశాల, ఎస్‌కేబీఆర్ కళాశాల, చిలకలూరిపేట సీఆర్ కళాశాల, మొర్దేన్ డిగ్రీ కళాశాల, నరసరావుపేట వాగ్దేవి డిగ్రీ కళాశాల, ఎస్ఎస్ఎన్ కళాశాల, ధరణికోట ఆర్‌వీవీఎన్ కళాశాల, పిడుగురాళ్ల ఎంఎల్ఎస్ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, సత్తెనపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల, క్రోసూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, నరసరావుపేటలోని నాక్ ట్రైనింగ్ సెంటర్‌లలో కార్యక్రమాలు నిర్వహించామన్నారు.

జిల్లాస్థాయి బ్యాడ్మింటన్‌లో విద్యార్థినికి ప్రథమ స్థానం

గుంటూరు ఎడ్యుకేషన్: బ్యాడ్మింటన్ జిల్లాస్థాయి చాంపియన్‌షిప్‌లో సుమేధ హైస్కూల్ విద్యార్థిని ప్రథమ స్థానంలో నిలిచినట్లు పాఠశాల డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. సోమవారం ఎన్జీఓ కాలనీలోని పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఈనెల 13, 14వ తేదీల్లో తాడేపల్లిలో జరిగిన 51వ జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ అండర్-11 బాలికల విభాగం సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో ప్రథమ స్థానం సాధించిన సంకట సాయి అక్షరను అభినందించారు. జిల్లాస్థాయిలో అనేక మంది క్రీడాకారులతో పోటీపడిన తమ విద్యార్థిని ప్రథమ స్థానంలో నిలవడం గర్వకారణమన్నారు. విద్యతోపాటు ఆట, పాటలతో కూడిన విధానంతో విద్యార్థుల సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ మల్లేశ్వరి, హెచ్‌ఎం రాంబాబు, పీఈటీ కిరణ్‌రెడ్డి, విద్యార్థిని తల్లిదండ్రులు సంకటి దుశ్యంత్ రెడ్డి, ప్రశాంతి, తాతయ్య జయరామిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థినిని అభినందించారు.